RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily

అనకాపల్లి | సంపుటి: 2 | సంచిక: 140 | గురువారం | 17-10-2024 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 4 | వెల : 3.00





# పెల్లాడియం చోరీని ఛేదించిన పోలీసులు

**- చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పరవాడ పోలీసులు - నాలుగు రోజుల్లో నిందితుల్ని అరెస్ట్ చేసిన పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ ఎం.దీపిక**



అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 16: ఫార్మా సిటీ లో సంచలనం కలిగించిన పెల్లాడియం చోరీ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. చోరీకి పాల్పడిన నలుగురి వ్యక్తులను అరెస్ట్ చేసి 4.11 కి లోల పెల్లాడియం లోహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం అనకాపల్లి ఎస్పీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక వెల్లడించారు.జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో కోల్కతా కి చెందిన ఆరోరా మెథీ లిమిటెడ్ కంపెనీని గత నెల 28 వ తేదీ నుంచి రాజస్థాన్ రాష్ట్రం లోని ఉదయపూర్ కి చెందిన రవీంద్ర హేరియస్ కంపెనీ టేకోవర్ చేసింది. సంస్థ మేనేజ్మెంట్ బదిలీల్లో లెక్కలు తేల్చేందుకు జరిగిన ఆడిట్ లో పెద్ద మొత్తంలో పెల్లాడియం చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో ఆ కంపెనీ ప్రతి నిధి ఎస్.వరదరాజన్ (డైరెక్టర్ టెక్నికల్ సపోర్ట్) పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన అనకాపల్లి సెంట్రల్ క్రైం పోలీసులు, పరవాడ పోలీసుల సహాయంతో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు దీపిక వెల్లడించారు. అరెస్ట్ చేసిన నిందితులలో 1.చింతకాయల రాజు 26 సంలు పెయింటర్ ముత్యాలమ్మ పాలెం గ్రామం, 2.ముద్దనూరు వినీత్ వర్మ 27 సం లు ఎలక్ట్రిషన్, విజయనగరం జిల్లా. 3.చింతకాయల మురళి 23 సం లు హెల్పర్ ముత్యాలమ్మ పాలెం గ్రామం. 4.కనుమూరి రామచంద్ర రాజు 23 సం.,లు, అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్ అక్కిరెడ్డిపాలెం గ్రామం కి చెందిన వారు అని నిందుతుల వివరాలు వెల్లడించారు. వీరివద్ద నుండి 4 కేజీ 110 గ్రాము పెల్లాడియం లోహం, సుమారు దీని విలువ రూ.1,15,00,000, పల్సర్ మోటార్ సైకిల్ లు, మారు తాళం చెవి లను జప్తు చేశారు. ఫార్మాసిటీ లో రవీంద్ర హేరియస్ కంపెనీ లో కార్బన్ ఉత్ప్రేరకాల పై సపోర్టు చేసే మెటల్ తయారీలో సంస్థ లో ఫార్మా సంస్థల్లో వాడే ఉత్ప్రేరకాల కోసం అనేక ఫార్మా కంపెనీలు పెల్లాడియం అనే ఖరీదైన లోహంతో ఉపయోగించి తయారు అవుతాయ అన్నారు. ఈ యూనిట్ యొక్క ప్రధాన వ్యాపారం తాజా ఉత్ప్రేరకాన్ని తయారు చేయడం, వాడిన ఉత్ప్రేరకం (క్యాటలిస్ట్ ) యొక్క రీ-సైక్లింగ్ చేసి ఆ ప్రక్రియలో పెల్లాడియం మెటల్‌ను డ్రైయర్‌లలో ఉంచి ఆరబెడతారు. అదే విధంగా 09.10.2024 న ప్రొడక్షన్ బ్లాక్‌లో ఉన్న డ్రైయర్‌లో రాత్రి పూట ఆరబెట్టడం కోసం 4.2 కిలోల పెల్లాడియం ను సాయంత్రం 4 గంటల సమయంలో ఉంచి దానికి తాళం కూడా వేశారు. ఆ రోజు కూడా ఎప్పటిలాగే ఉదయం 8 గంటలకు ప్లాంట్ పనిచేస్తూ సాయంత్రం 4 గంటల మూసి వేయబడింది. అయితే ఆమరుసటి రోజు ఉదయం 08:20 గంటల సమయంలో తాళం కప్ప లేకపోవడం, డ్రైయర్ తెరవబడి అందులో నుంచి పెల్లాడియం మెటల్ ను దొంగతనం చేసినట్లుగా సంస్థ సిబ్బంది గుర్తించి పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక, అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎల్.మోహన్ రావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ పర్యవేక్షణలో పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో 15 తేదీ సాయంత్రం 7 గంటలకు తానం శ్మశాన వాటిక వద్ద పై నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారు నుంచి ఈ కేసులో చోరీ అయిన మొత్తం పెల్లాడియం మెటల్ ను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశములు ప్రకారం నలుగురు నిందితులు 05.10.2024 సాయంత్రం లంకెలపాలెం ఓ హొటల్‌లో కలుసుకుని పెల్లాడియం చోరీకి ప్రణాళిక వేసినారన్నారు. వారి ప్లాన్‌లో భాగంగా ఏ2 & ఏ 4 అదే రోజున సీసీ కెమెరాలను ఆపివేసి, డ్రైయర్ లాక్ యొక్క మారు తాళం చెవిని కూడా తయారు చేసి సిద్ధం చేసుకున్నారు. తరువాత వారు ప్లాన్‌లో భాగంగా ఏ1 %ఌ% ఏ3 ఇద్దరు కలిసి తేదీ 09.10.2024 రాత్రి ప్లాంట్ యొక్క గోడను దూకి లోపలకి ప్రవేశించి మారు తాళం చెవి తో డ్రైయర్ కు ఉన్న తాళం తీసి లోపల ఉన్న పెల్లాడియం మెటల్ చోరీ కి పాల్పడ్డారు అని తెలియజేసారు. ఏ1 నిందితుడు తన ఇంటి వద్ద పెల్లాడియం ను భద్రపరిచాడు. ఇప్పుడు అందరూ దొంగిలించబడిన పెల్లాడియం విక్రయించడానికి రిసీవర్ల కోసం వెతుకుతున్న సందర్భంగా వారు పోలీసులకు పట్టుబడ్డారని ఎస్పీ దీపిక వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఇటువంటి దొంగతనాలు నివారించేందుకు అన్ని కంపెనీలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఎప్పటి కప్పుడు మెయింటినెన్స్ చేయాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు యాజమాన్యం కోరితే ఉద్యోగుల నడవడిక వారి పై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉన్నవి వెరిఫికేషన్ చేయిస్తామన్నారు. ఈ కేసుని నాలుగు రోజులలో ఛేదించి మొత్తం చోరీ అయిన కోటి రూపాయిల కు పైగా విలువ కలిగిన పెల్లాడియం మెటల్ ను స్వాధీనం చేసుకున్నందుకు ఎస్పీ పరవాడ ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, సిసిఎస్ ఎస్ఐ పి.రమేష్, పరవాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎఎస్ఐ బి.వై.నాయుడు, కానిస్టేబుల్ జివివిఎస్.నాయుడు, కె.హేమంత్ లను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.





# భవిత కేంద్రం ఆకస్మిక తనిఖీ

అనకాపల్లి పెన్ సత్తా అక్టోబరు 16: భవిత కేంద్రం లోని విద్యార్థులకు మానసిక వికాసం పెంపొందించేలా బోధన చెయ్యాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ తెలిపారు. కసింకోటలో గల భవిత కేంద్రాన్ని జిల్లాకలెక్టరు విజయ క్రిష్ణణ్ బుధవారం ఆకశ్మికంగా తనిఖీ చేసారు. భవిత కేంద్రంలో దివ్యాంగులకు అందిస్తున్న సేవల గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మానసిక వికాసం కలిగేలా విద్యాబోధన అందించాలని తెలిపారు. భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి యొక్క అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. భవిత కేంద్రాల్లో గల విద్యార్థుల వివరాలు, వారు ఏవిధమైన విద్యను అభ్యసిస్తున్నారు, ఫిజియోథెరపీ, స్పీచ్ తెరపి సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు అందించాలని, వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ వారి ఆలోచనలు, శక్తిసామర్ధ్యాలు మెరుగుపడేలా తోడ్పడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరవాడ ఎన్టిపిసి అందిస్తున్న భోధనోపకరణ సామాగ్రిని కూడా త్వరలో జిల్లాలో ఉన్న అన్ని మండలాల భవిత కేంద్రాలకు అందించాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త శకుంతలను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజినల్ అధికారి షేక్ ఆయిషా, విద్యాశాఖ సహాయ సంచాలకులు జి. రామ జ్యోతి, కసింకోట ఎంఈఓ వెంకటసురేష్, జిల్లా సహితవిద్య సమన్వయకర్త శకుంతల పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణం పై చర్యలేవి?

**దేశపాత్రునిపాలెంలో అక్రమ నిర్మాణం పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు ఉద్యోగ బాధ్యతను విస్మరించిన ప్లానింగ్ సెక్రెటరీ**






పరవాడ పెన్ సత్తా అక్టోబర్ 16: జీవీఎంసీ పరిధి 79 వ వార్డు దేశపాత్రునిపాలెంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదు. అనుమతులు లేకుండా కొందరు విచ్చల విడిగా నిర్మాణాలను చేపడుతున్నా అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం స్పందించడం లేదు. స్థానికంగా ఉన్న సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ కూడా అక్రమ నిర్మాణదారులకే అండగా నిలుస్తూ జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. గాజువాక - యలమంచిలి ప్రధాన మార్గాన్ని ఆనుకుని వైయస్సార్ విగ్రహానికి వెనుక భాగంలో ఇటీవల కొంత కాలంగా ఓ అక్రమ నిర్మాణం జరుగుతోంది. మూడో అంతస్తుగా జరుపుతున్న భవనానికి ఇటీవల స్లాబ్ వేసి చుట్టూ పిట్ట గోడను కూడా కట్టారు. ప్లానింగ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అతను ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా ఫిర్యాదు దారుల ఫోన్ల కు స్పందించడం లేదు. నిర్మాణం మొదట నుంచి అధికారులకు పిర్యాదులు వెళ్తున్నాయి. కానీ డొంకతిరుగుడు మాటలు చెబుతూ నిర్మాణం పూర్తయ్యే వరకు అక్రమ నిర్మాణదారులకు అండగా నిలిచారు. దీంతో భవన నిర్మాణం ప్రస్తుతం పూర్తి కావొచ్చింది. ఈ అక్రమ నిర్మాణాల్లో ప్లానింగ్ సెక్రటరీ కూడా ఆమ్యామ్యాల మత్తులో మునిగి తేలుతున్నట్లు స్థానికంగా విమర్శలు వినవస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని వాటిని తొలగించాల్సిన ప్లానింగ్ అధికారులు కూడా ఎలాంటి చర్యలకు ఉపక్రమించక పోవడం తీవ్రమైన ఆరోపణలకు దారి తీస్తోంది. మరో పక్క ఫిర్యాదుల పైనా ఎలాంటి స్పందన కనిపించడం లేదు. అలాగే అందిన కాడికి తీసుకుని భవన నిర్మాణదారులకు పూర్తిగా సహకారం అందిస్తున్నట్లు ప్లానింగ్ అధికారుల పైనా, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ పైనా తీవ్ర విమర్శలూ లేకపోలేదు. తమ వ్యక్తి గత ఆదాయం కోసం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ ఉద్యోగ బాధ్యతను విస్మరించారని ఆరోపణలు ఉన్నాయి. దీని పై ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించడంతో పాటు ప్లానింగ్ సెక్రటరీ వ్యవహారంపై విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# సుడిగాలి శంకుస్థాపనలు చేసిన పంచకర్ల



పరవాడ పెన్ సత్తా అక్టోబర్ 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలంలో పల్లె పండగ-పంచాయతీ వారోత్స వాల కార్యక్రమం నిర్వహిం చడం జరిగినది. బుధవారం ఈ కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సుడిగాలి పర్యటన నిర్వ హిస్తూ శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా పెదముసిడివాడ గ్రామ పంచాయతీ లో మొదలుపెట్టి కన్నూరు గ్రామపంచాయతీ, తానం గ్రామపంచాయతీ, భరిణికం గ్రామ పంచాయతీ, పరవాడ గ్రామపంచాయతీ, వెన్నెలపాలెం గ్రామ పంచా యతీ, గొర్లివానిపాలెం గ్రామ పంచాయితీ, పి బోనంగి గ్రామ పంచాయతీలలో లో పల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రమేష్ బాబు తో పాటు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, మాజీ జెడ్పిటిసి పయిల జగన్నాథ రావు, సర్పంచులు ఎంపీటీసీ లు, ఎంపీడీవో, తహసిల్దార్, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ కి సంబంధించిన డీఈ, ఏఈ, గ్రామ పంచాయతీల సెక్రటరీలు, కూటమి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పెద్దలు, గ్రామ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైతులు ఇబ్బంది పడకుండా రెవెన్యూ సదస్సులు

## - చోడవరం తాహసిల్దార్ ఎ.రామారావు

చోడవరం పెన్ సత్తా అక్టోబర్16: రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17 నుండి వచ్చే నెల 17 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని చోడవరం తాహసిల్దార్ ఎ.రామా రావు తెలిపారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాహసిల్దార్ రామారావు మాట్లాడుతూ.... సుదీర్ఘ కాలంగా రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరచుకొని, గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 17 గురువారం నుండి, నవంబర్ 17 వరకు నెల రోజులపాటు మండలంలోని ప్రతి గ్రామం సచివా లయాలు వద్ద రెవెన్యూ సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకు సభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.




పట్టాదారు పాసు పుస్తకాల్లో దొర్లినతప్పులను సవరించడం, అవసరాన్ని బట్టి రీ సర్వే, క్యాటగిరి వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామసభ ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకొస్తే, ఆన్లైన్ చేసి, నిర్దిష్ట సమయంలో సమస్యను పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 17 గురువారం ఉదయం 8 నుండి 1 గంట వరకు చోడవరంలోని అన్నవరం, మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు వెంకయ్యగారిపేలో గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. 18న పి ఎస్ పేట, 19 న జుత్తాడ, 21 న గౌరీపట్నం, 22న అంకుపాలెం, 23న గజపతినగరం, 24 న భోగపురం, 25న గవరవరం, 26న దామునాపల్లి, 28న చోడవరం, 29న ఎం కొత్తపల్లి, 30న నరసయ్యపేట, నవంబర్ 2న కండేపల్లి, 4న అంబేరుపురం, 5న తిమ్మన్నపాలెం, 6న చాకిపల్లి, 7న దుద్దుపాలెం, 8న ముద్దుర్తి, 11న గంధవరం, 12న శ్రీరామ పట్నం, 13న గోవాడ, 14న సీమనాపల్లి, 16న లక్కవరం, 17న మైచర్లపాలెం గ్రామాలలో నిర్వ హిస్తున్నామని ప్రతి ఒక్కరూ పాల్గొని గ్రామ సభలు విజయవంతం చేయాలని కోరారు. అలాగే సివిల్ సప్లై సమస్యలను గ్రామసభలలో పరిష్కరించనున్నామన్నారు. రేషన్ కార్డులు గ్రామాల్లో 800 దాటితే మరొక రేషన్ డిపో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు పి. సత్యనారాయణ, జనపరెడ్డి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.




## జాబ్ మేళాలో 94 మందికి ఉద్యోగాలు

చోడవరం పెన్ సత్తా అక్టోబర్16: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 94 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. కాలేజీ ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ జాబ్ మేళాను ప్రారంభించి మాట్లాడుతూ.... ఇది రెండవ జాబ్ మేళా అని భవిష్యత్తులో ఇటువంటివి మరెన్నో నిర్వహిస్తామని, అవకాశం ఉన్నంత వరకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. 125 మంది విద్యార్థులు రిజిస్టర్ చేయించుకోగా వారిలో 94 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వి.అప్పల నాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారులు డి.మాల్యాద్రి, పిచ్చమ్మ, రత్న భారతి పలువురు అధ్యాపకులు సిబ్బంది వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



## మద్యం దుకాణాలు ప్రారంభం

చోడవరం పెన్ సత్తా అక్టోబర్16: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ చోడవరం సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాలను కొన్ని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎం.ఎస్ రాజు ప్రారంభించారు. చోడవరంలోని కొత్తూరు జంక్షన్ సమీపములో ఉన్న షాపు తదితర దుకాణాలు ఎమ్మెల్యే ప్రారంభించగా, చోడవరం సర్కిల్ పరిధిలో 22 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటిలో చోడవరం మండలంలో 8, బుచ్చియ్యపేట మండలంలో 5, కే.కోటపాడు మండలంలో 5, దేవరాపల్లి మండలంలో 4 వున్నాయి. అయితే ఈరోజు నుండే కొత్త మద్యం పాలసీ ప్రకారం అమ్మకాలు జరగడంతో పాత ధరలకే అమ్మకాలు జరిపారు. పాత స్టాక్ ఉండడం వలన ఆ స్టాక్ ఉన్నంతవరకు వారం రోజులు పాత ధరలకే అమ్మకాలు ఉంటాయని అంటున్నారు. వీటిపై సంబంధిత అధికారులు విధి విధానాలు రూపొందించవలసి ఉంది. ఈ కార్యక్రమంలో విశాఖ డైయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, మాజీ జడ్పిటిసి కనిశెట్టి మచ్చిరాజు, విజయరామ రాజుపేట మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్, యూత్ నాయకుడు సకురు కోటేశ్వరరావు, చికెన్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



## సద్భావన టీం కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ప్రారంభం

చోడవరం పెన్ సత్తా అక్టోబర్16: స్థానిక స్వయంభూ శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం చోడవరంలోని సద్భావన టీం కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ఏర్పాటు చేసింది. అవసరమైన వారికి భోజనాలు, మజ్జిగ, అల్పాహారం వంటివి అందుబాటులో ఉంచడానికి ఫ్రిడ్జ్ ను ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి మాట్లాడుతూ.... పేదలకు నిరుపేదలకు ఎవరైనా ఏదైనా ఆహారం ఇచ్చి సహకరించాలనుకున్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతిరోజు ఉదయం, సాయంత్రం భోజనం, టిఫిన్, మజ్జిగ, బిస్కెట్లు తదితర తిను పదార్థాలు అవకాశం ఉన్నవారు ఫ్రిజ్లో పెడితే వాటిని అవసరమైన వారు తీసుకుంటారని తెలిపారు. ఫ్రిడ్జ్ లో ఆహారం ఉన్నప్పుడు తాళాలు తీసి ఉంటాయని, ఆహారం లేనప్పుడు మూసివేస్తామని అవసరమైన వారు 8074755476 నెంబర్కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. మొదటిరోజు ఎస్.ఎస్ షాపింగ్ మాల్ పి.ఎస్.కే గుప్తా, అశోక్, శ్రీను భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ తేజ సత్తిరెడ్డి, కొప్పాక రాజేష్, దామునాపల్లి సర్పంచ్ బలిరెడ్డి నాగేశ్వరరావు, గర్ల్స్ హైస్కూల్ మాజీ చైర్మన్ దేవరపల్లి కుమారి, దేవాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, మాజీ చైర్మన్ నున్న నాగేశ్వరావు, కమిటీ సభ్యులు నేమాల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ హ్యాక్థాన్ గడువు పొడిగింపు - ఎమ్‌డి కె దినేష్‌కుమార్




అమరావతి: డ్రోన్ హ్యాక్థాన్ పోటీల దరఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు రోజులు పొడిగించింది. ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను ప్రభుత్వం నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సులో నిర్వహించే హ్యాక్థాన్ పోటీల కోసం 400 మంది ఔత్సాహికులు పేర్లు నమోదుచేసుకోగా, మరింత మంది పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఎపి డ్రోన్స్ కార్పొరేషన్ సిఎమ్‌డి కె దినేష్‌కుమార్ తెలిపారు. పాల్గొనేవారు ఈ నెల 17లోపు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9 థీమ్స్‌లో జరిగే పోటీల్లో గెలుపొందిన విజేతలకు నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి ప్రతి కేటగిరి నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష చొప్పున నగదు అందిస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా 22న విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం

డ్రోన్ సమ్మిట్-2024 ఆహ్వాన పత్రాన్ని సిఎం చంద్రబాబుకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనశాఖ మంత్రి బిసి జనార్ధన రెడ్డి బుధవారం సచివాలయంలో అందజేశారు. మంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీరబ్‌కుమార్ ప్రసాద్, మౌలిక సదుపాయాల కల్పనశాఖ కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, డ్రోన్స్ కార్పొరేషన్ సిఎమ్‌డి కె దినేష్‌కుమార్ ఉన్నారు.



## అగ్నిమాపక శాఖ కేంద్రాల నిర్వహణ ఇన్ టైమ్ సర్వీసెస్ సంస్థకు కలెక్టర్

అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 16 : జిల్లా లోని నక్కపల్లి, రావికమతం లలో గల అగ్నిమాపక శాఖ కేంద్రాల నిర్వహణ బాద్యతలను ఇన్ టైమ్ సర్వీసెస్ సంస్థకు అప్పగించినట్లు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణణ్ తెలిపారు. నక్కపల్లి, రావికమతం అగ్నిమాపక కేంద్రాల నిర్వహణకు గాను ఐదు సంవత్సరాల కాల పరిమితికి టెండర్లు కోరడమైనదన్నారు. సంవత్సరానికి 20.36 లక్షలు రూపాయలు టెండరు ధరగా నిర్ణయించి టెండర్లు పిలువగా వచ్చిన సీల్డ్ టెండర్లును బుధవారం కలెక్టరు కార్యాలయంలో ఓపెన్ చేసి తక్కువగా 20 లక్షల 35 వేల 400 రూపాయలకు కోడ్ చేసిన ఎస్.కవితకు చెందిన ఇన్ టైమ్ సర్వీసెస్ సంస్థకు నిర్వహణ బాద్యతలను అప్పగించినట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్, అగ్నిమాపక అధికారి ఆర్.వెంకటరమణ, డి.ఎఫ్.ఒ, పంచాయతీ రాజ్ ఇఇ, పాల్గొన్నారు.

## తెలంగాణలో ఘోరరోడ్డు ప్రమాదం

### - అతివేగంతో చెట్టును ఢీ కొట్టిన కారు - ఏడుగురు మృతి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టి వాగులో పడిపోయింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఏడుగురు మృతి చెందారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలంలోని శంకర్‌తండా, సీతారాంతండా, తాళ్లపల్లితండాకు చెందిన ఎనిమిది మంది.. ఓ కారులో తూప్రాన్ మండలం వెంకటాయపల్లి తండాలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యారు. తిరుగు ప్రమయాణంలో ఉసిరికపల్లి చక్కెర ప్యాక్టరీ సమీపంలోని బిడ్జి వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా చెట్టును ఢీ కొని వాగులో పడిపోయింది. ఈ ప్రమాదంలో తాళ్లపల్లి తండాకు చెందిన ధనవత్ శివరాం (55), ధనవత్ దుర్గమ్మ (45), జెగ్య తండాకు చెందిన మాలోత్ అనిత (30), మాలోత్ బిందు (14), మాలోత్ శ్రావణి (12), భీమ్లా తండాకు చెందిన గుగులోత్ శాంతి (45), గుగులోత్ మమత (16) అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని జెసిబి సహాయంతో వాగులోని కారును బయటకు తీశారు. కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో మృతదేహాలను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్ నామ్‌సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఖాళీల భర్తీకి తీసుకున్న చర్యలేమిటి? : హైకోర్టు

అమరావతి: పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 19,999 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలను తెలియజేయాలని ఆదేశించింది. పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ వేసిన పిల్‌పై విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. కాగా ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఛైర్మన్, ఇతర సభ్యుల నియామకాల కోసం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో పది మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఆ వివరాలను నివేదించాలన్న హైకోర్టు పిల్‌పై విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.



## అన్న క్యాంటీన్లకు టిడిపి రంగుపై పిల్

అమరావతి: రాష్ట్రంలోని అన్న క్యాంటీన్ల బిల్డింగ్స్‌కు అధికార టిడిపి జెండా రంగులు వేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను బుధవారం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. అన్న క్యాంటీన్లకే కాకుండా ప్రభుత్వ భవనాలకు టిడిపి జెండా రంగు పసుపు, ఎరుపు వేయడాన్ని తప్పుపడుతూ ఎపి ఎన్‌జిఒ సంఘం పూర్వ అధ్యక్షులు నలమారు చంద్రశేఖర్ రెడ్డి పిల్ వేశారు.

## మిథున్‌రెడ్డి పర్యటనపై ఆంక్షలు ఉన్నాయా? : హైకోర్టు

అమరావతి: రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని పుంగనూరు వెళ్లకుండా ఏమైనా ఆంక్షలు విధించారో లేదో చెప్పాలని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. నియంత్రణ ఆదేశాలు జారీ చేస్తే వాటి ప్రతిని అందజేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్ కృపాసాగర్ బుధవారం ఆదేశాలిచ్చారు. శ్రీ భద్రతపై వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బివిఎల్ చక్రవర్తి విచారణ జరిపారు. పిటిషనర్‌కు ఉన్న భద్రత వివరాలను అందజేయాలని పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

# రెండు నెలల్లో టెండర్లు

**- అమరావతిలో పనులపై సిఆర్‌డిఎ నిర్ణయం - ట్రంక్ ఇన్‌ఫ్రా కోసం డిపిఆర్**



అమరావతి: రాజధాని అమరావతి నగరంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తి కోసం డిపిఆర్ తయారు చేయాలని, నిలిచిపోయిన అన్ని పనులకూ రెండు నెలల్లో టెండర్లు పిలవాలని సిఆర్‌డిఎ 38వ అథారిటీ నిర్ణయించింది. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యాన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశం సిఆర్‌డిఏకు సంబంధించిన నాలుగు ఆర్థిక సంవత్సరాల ఆడిట్ నివేదికలను ఎజికి సమర్పించేందుకు ఆమోదం తెలిపారు. ఎన్విరాన్‌మెంట్ అండ్ సోషల్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఆలిండియా సర్వీసు అధికారుల భవనాల పాత టెండర్లు రద్దు చేసింది. పెండింగ్ పనులు రూ.524.70 కోట్లతో పూర్తిచేయాలని టెండర్లు పిలిచేందుకు ఆమోదించింది. ఎపిసిఆర్‌డిఏ ప్రాజెక్టు ఆఫీసు పెండింగ్ పనుల పూర్తికి ఎల్‌వన్‌గా నిలిచిన సంస్థలకు బాధ్యతలు అప్పగించాలని నిర్నయించారు. క్యాపిటల్ సిటీ అభివృద్ధికి ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నుండి రూ.15 వేల కోట్ల రుణం తీసుకోవాలనే ప్రతిపాదనను ఆమోదించారు. సిఆర్‌డిఏ ఏర్పాటైన తరువాత 2017 సంవత్సరం నుండి ఆడిట్ జరగలేదు. వీటికి సంబంధించిన రిపోర్టులు వెంటనే ఎజికి సమర్పించాలని నిర్ణయించారు. రూ.50 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు కావడంతో ప్రతి నిర్మాణానికి పర్యావరణ అనుమతి అవసరం ఉంది. దీనికోసం ప్రత్యేకంగా ఎన్విరాన్‌మెంట్ అండ్ సోషల్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేయాలనే సిఆర్‌డిఏ నిర్ణయానికి అథారిటీ ఆమోదముద్ర వేసింది. సిఆర్‌డిఏ ప్రాజెక్టు ఆఫీసు పూర్తికి ఎల్‌వన్‌గా నిలిచిన కెసిపి సంస్థకు పనులు అప్పగించాలని అథారిటీ నిర్ణయించింది.

**34 రోడ్లు %% మురుగునీటి కాలువలు**

రాజధాని నగరంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో భాగంగా 34 రోడ్లు, మురుగునీటి కాలువలు, నీటి సరఫరా నెట్‌వర్కు, పవర్ సదుపాయాలు, వరద నివారణ పనులు, పాలవాగు, కొండవీటివాగు కాలువ నిర్మాణాలు చేపట్టనున్నారు. అలాగే శాఖమూరు, నీరుకొండ, కృష్ణాయపాలెంలో రిజర్వాయర్లను విస్తరించాలని నిర్ణయించారు. వరద నీటి నిర్వహణ కోసం ప్రస్తుతం ఉండవల్లి వద్ద ఉన్న లిఫ్టును పెంచాలని, వైకుంఠపురం వద్ద రెండో లిఫ్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో నిలిచిపోయిన పనుల పరిస్థితిని అంచనా వేసేందుకు టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని టెండర్లు ఆర్‌వి అసోసియేట్స్ దక్కించుకుంది. అమరావతికి సంబంధించి అన్ని టెండర్లు నవంబరు, డిసెంబర్‌లోగా పూర్తవుతాయి,.

**జనవరిలోపు అసెంబ్లీ, సచివాలయ టెండర్లు**

అసెంబ్లీ, సెక్రటేరియట్ పనులకు అవసరమైన టెండర్లను జనవరిలోపు పిలుస్తామని ఈ సమావేశ నిర్ణయాలను మీడియాకు వివరించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఈ పనులన్నీ రెండేళ్లలో పూర్తవుతాయని తెలిపారు. ఐకానిక్ భవనాలు రెండున్నరేళ్లలో పూర్తవుతాయని పేర్కొన్నారు. అసైన్డ్ రైతులకూ కౌలు వేశామని పేర్కొన్నారు. ఇంకా 1400 మందికి ఇవ్వాలి ఉందని చెప్పారు. గతంలో భూములు ఇచ్చిన వారికి లాటరీ పద్ధతిలో పదిరోజుల్లో ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పూర్తయిందని, సింగపూర్ గవర్నమెంటును రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం చేసే అంశంపై ఇంకా మాట్లాడాల్సి ఉందని చెప్పారు. కరకట్టరోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించాలని నిర్ణయించామని చెప్పారు. దీనిపై లీ అనే సంస్థ అధ్యయనం చేస్తోందని వివరించారు. కొత్తగా 200 ఎకరాలు పూలింగులో ఇచ్చారని, ఇవ్వనివారి భూములకు సేకరణ నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి చెప్పారు. తెలిపారు.. ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలనుకన్న చోట జాతీయ రహదారి వచ్చిందని, దీంతో అక్కడ ఐకానిక్ ప్లాను అమలు జరగడంలేదని, ఇన్నర్‌రింగురోడ్డు లేదా ఔటర్‌రింగురోడ్డు నిర్మించే సమయంలో ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అధికారులు కాంతిలాల్ దండే, సిఎం సెక్రటరీ ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని మంత్రి నారాయణ మీడియాకు వివరించారు.



# సజ్జలకు నోటీసులు...

## నేడు విచారణకు రావాలని ఆదేశం

గుంటూరు: గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులో వైసిపి కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డికి బుధవారం మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు హాజరు కావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. వేర్వేరు కేసుల్లో ఉన్న సజ్జలకు దేశం విడిచి పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు పోలీసులు ఇప్పటికే జారీ చేశారు. మంగళగిరి టిడిపి కార్యాలయంపై దాడి కేసులో విచారణకు హాజరు కావాలంటూ తాజాగా ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు నేతలను పోలీసులు విచారించారు. దాదాపు 28 మందిని అరెస్ట్ చేశారు. మొత్తం 68 మందిని దాడికి పాల్పడినట్లు గుర్తించారు. వారిలో పలువురు నాయకులు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించి అరెస్టు నుంచి మినహాయింపు పొందారు.

# కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లండి

**- తర్వాత వివాదం తేలుస్తాం - ఐఎఎస్‌ల పిటిషన్లు కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు**

హైదరాబాద్: డిఒపిటి ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ఐఎఎస్ అధికారులకు నిరాశే మిగిలింది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్రం నుంచి రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఐఎఎస్ అధికారులు వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, సృజన, శివశంకర్, హరికిరణ్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. దీంతో, ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఐఎఎస్‌లు సృజన, శివశంకర్, హరికిరణ్ బుధవారం సాయంత్రం తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి రిపోర్టు చేశారు. తెలంగాణలో పనిచేస్తున్న వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి కట్టాలను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. డిఒపిటి ఆదేశాలను నిలిపివేయాలన్న ఐఎఎస్‌ల అభ్యర్థనను క్యాట్ తోసిపుచ్చడంతో వారు బుధవారం తెలంగాణ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్ర ట్రిబ్యునల్‌లో నవంబరు 4న విచారణ ఉందని, అప్పటి వరకు రిలీవ్ చేయవద్దని ఐఎఎస్‌ల తరపు న్యాయవాది కోర్టును కోరారు. రీలీవ్ చేసేందుకు 15 రోజుల గడువు ఇవ్వాలని రెండు రాష్ట్రాలు డిఒపిటిని కోరాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. గత పదేళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని వాదనలు వినిపించారు. క్యాట్ తుది తీర్పు ఇచ్చే వరకు రిలీవ్ చేయవద్దని కోరారు. ఐఎఎస్‌ల వాదనలను ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. స్టే ఇస్తూపోతే ఈ అంశం ఎన్నటికీ తేలదని వ్యాఖ్యానించింది. 'ముందుగా మీకు కేటాయించిన రాష్ట్రాల్లో చేరండి. తర్వాత వివాదాన్ని తేలుస్తాం' .అని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'మీరంతా బాధ్యతాయుతమైన అధికారులు. ప్రజలకు ఇబ్బంది కలగనీయొద్దు. ఎవరు ఎక్కడ పనిచేయాలనేది కేంద్రం నిర్ణయిస్తుంది. మరోసారి పరిశీలించాలని డిఒపిటిని ఆదేశించమంటారా?' అని ఐఎఎస్‌లను ధర్మాసనం ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ వాదనలు వినిపించారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేయాలో కోర్టులు నిర్ణయించవద్దని, క్యాట్ స్టే ఇవ్వకపోవడం సరైన నిర్ణయమేనని అన్నారు. డిఒపిటి నిర్ణయం ఎలా సరైందో పూర్తి వివరాలతో క్యాట్‌లో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం ఐఎఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.



# అదుపులోకి రాని అతిసార

**- ఇంకా వైద్య శిబిరం, ఆస్పత్రుల్లో 60 మంది - కోలుకుంటున్న బాధితులు**



విజయనగరం : విజయనగరం జిల్లా గుర్ల మండలంలో నాలుగు రోజుల క్రితం ప్రబలిన అతిసార గుర్ల, ఘోషాడ గ్రామాల్లో ఇంకా అదుపులోకి రాలేదు. గుర్ల గ్రామానికి చెందిన వారు సోమవారం ఒకరు, మంగళవారం నలుగురు మృతి చెందడంతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. తాజాగా గుర్లకు చెందిన మరో ఇద్దరు అతిసారకు గురై వైద్యం కోసం శిబిరంలో చేరారు. ప్రస్తుతం గుర్లలోని జడ్‌పి హైస్కూలులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 52 మంది, జిల్లా కేంద్రాస్పత్రిలో నలుగురు, చీపురుపల్లి సిహెచ్‌సిలో నలుగురు మొత్తంగా 60 మంది చికిత్స పొందుతున్నారు. వీరంతా గుర్ల, ఘోషాడ గ్రామాలకు చెందిన వారే ఉన్నారు. చంపావతి నుంచి ఎస్ఎస్ఆర్‌పేట వద్ద పంపుహౌస్‌ల ద్వారా పలు గ్రామాలకు సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు ఎస్ఎస్ఆర్ పేట పంపుహౌస్ నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. మరోవైపు అధికారులు మాత్రం గుర్లలోని ఐదుబోర్లలో నీరు కలుషితం కావడం వల్ల ప్రబలిందని చెబుతున్నారు. అలా అయితే ఆ అయిదిళ్లకు చెందిన వారే వ్యాధి బారినపడాలని, కానీ గ్రామమంతా అతిసార బారిన ఎలా పడతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గుర్ల లోని బోర్ల నీటి శ్యాంపిల్స్‌ను తీసుకెళ్లారు. అప్రమత్తమైన వైద్యాధికారులు మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూలులో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. సీరియస్ కేసులను విజయనగరం, పురుపల్లి ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేసినట్లు వైద్యాధికారి చెన్నరు తెలిపారు.

**అతిసార అదుపులోనే ఉంది : కలెక్టర్**

గుర్లలో అతిసార అదుపులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఇప్పటి వరకు ఎవరూ అతిసారతో మృతి చెందలేదని, చనిపోయిన వారు గుండెపోటు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న వారని చెప్పారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రోజున విరేచనాలు తగ్గిన వారు ఇళ్లకు వెళ్లడం, వారు వినియోగించిన టాయిలెట్లను వారి కుటుంబ సభ్యులు వినియోగించడం వల్ల మిగిలిన వారికి సోకినట్లు గుర్తించామని తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల కూడా డయేరియా సోకి ఉంటుందని చెప్పారు. వాస్తవ పరిస్థితులపై వెంటనే నివేదిక నివ్వాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యు ఎస్ఇ ఉమా శంకర్ మాట్లాడుతూ గుర్ల గ్రామంలో ఐదు బోరు బావుల నీటి శాంపిల్స్ ను పరీక్షించామని, నీరు కలుషితంగా ఉందని తెలిపారు. జడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో నలుగురు మృతి చెందినా తాగునీటి సరఫరా లోపాలను సరిదిద్దేవారే లేరని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ పరామర్శించి మాట్లాడారు. డయేరియాతో ఎవరూ చనిపోలేదని కలెక్టర్ ప్రకటించడం సరైనదికాదని, నివారణకు యుద్ధ ప్రాతిపదికను చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు పరామర్శించారు.

# కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

## - ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలోని గిరిజన కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడాల్ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన రైతులు పండిస్తున్న కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని, అందుకు తగ్గట్టుగా గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు. పార్చ్‌మెంట్ కాఫీ కిలోకు రూ.500, అరబిక్ చెర్రీ కాఫీ కిలోకు రూ.300, రోబస్ట చెర్రీ కాఫీ కిలోకు రూ.200 చొప్పున గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాఫీ అపెక్స్ కమిటీ 2024-25 సంవత్సరంలో కొనుగోలు చేసే కాఫీ లక్ష్యాలకు సంబంధించి ధరలు ప్రకటించిందని, ఈ మేరకు పార్చ్‌మెంట్ కాఫీ కిలోకు రూ.285, అరబిక్ చెర్రీ కాఫీ కిలోకు రూ.150, రోబస్ట చెర్రీ కాఫీ కిలోకు రూ.80 ధరను చెల్లించనుందని పేర్కొందన్నారు. దీనిపట్ల ఆదివాసీ కాఫీ రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాఫీ ధరల నిర్ణయంపై అపెక్స్ కమిటీ పునరాలోచన చేసి, ధరలు పెంచాలని కోరారు. అరకు ఆర్గానిక్ కాఫీకి ప్రపంచ వ్యాప్తంగా మంచి ధర ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తూ




పెద్దపెద్ద బహుళ జాతి సంస్థలకు లాభాలు చేకూరుస్తున్నాయని, కాఫీ రైతులకు తక్కువ ధర చెల్లించి తీవ్రంగా నష్టపరుస్తున్నాయని తెలిపారు. 2008 నుంచి కాఫీ బకాయిలు సుమారు రూ.60 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉందని, వాటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు కె.సత్యనారాయణ, ఎస్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

### - స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

ఉక్కునగరం (విశాఖపట్నం): వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1343వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఉక్కు కార్మికులకు ప్రస్తుతం సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం కోసం రా మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడం లేదని తెలిపారు. సంఘం సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గంపై నానాటికీ ప్రభుత్వ దాడి పెరుగుతోందని, వేతన ఒప్పంద చర్చలు సరైన పద్ధతిలో జరగడం లేదని తెలిపారు. బోనస్‌పై చర్చ లేకుండా కార్మికుల అభిప్రాయాలకు భిన్నంగా యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం సమ్మెకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భానుమూర్తి, గంగాధర్, నీలకంఠం, వెంకటరావు పాల్గొన్నారు.

## జగన్ ఇంటి రక్షణ గడ్డర్‌కు అనుమతులేవీ?

### - టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

అమరావతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఇంటిని అత్యంత భద్రతతో కట్టుకోవాల్సిన అవసరమేమొచ్చిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. దీనికోసం రూ.12.85 కోట్ల ప్రజాధనం ఖర్చుపెట్టి ఇంటికి రక్షణగా రక్షణ గడ్డర్ కట్టుకోవడానికి ఎవరు అనుమతించారో బయటపెట్టాలన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టులు, సెటిల్‌మెంట్ గ్యాంగ్, రిలీజియన్ గ్రూప్, ఐఎస్ఐ వంటి గ్రూప్‌ల నుంచి బెదిరింపులు లేనప్పుడు ఎందుకు అంతటి రక్షణ ఏర్పాటు చేసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల సొమ్ముతో తన రక్షణ కవచం తనకు ఎందుకని అతనికి అనిపించలేదా? అని ప్రశ్నించారు. ప్రజల డబ్బును జగన్‌తోనే కక్కించాలని ముఖ్యమంత్రిని కోరారు. పదవి పోయి నాలుగు నెలలైనా కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదో అర్థం కావడం లేదన్నారు. కోర్టులు కూడా జగన్‌ను ఎందుకు పిలవడం లేదో అనుమానానికి తావిస్తోందన్నారు.

# ప్రగతే లక్ష్యంగా కొత్త పాలసీలు

**- క్యాబినెట్ సమావేశానంతరం చంద్రబాబు - 20 లక్షల ఉద్యోగాలు, రూ.30 లక్షల పెట్టుబడులు వస్తాయని ప్రకటన**

**- ఉపాధి కల్పన, ధరల నియంత్రణ, గంజాయి నియంత్రణలకు మంత్రివర్గ ఉపసంఘాలు**



అమరావతి: రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా ఆరు కొత్త పాలసీలను మంత్రిమండలి ఆమోదించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన చంద్రబాబు మంత్రవర్గ సమావేశ నిర్ణయాలను వివరించారు. ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు ఆరు కీలక రంగాలకు చెందిన నూతన పాలసీలను మంత్రిమండలి చర్చించి, ఆమోదించిందని ఆయన తెలిపారు. 'ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తెచ్చాం. వన్ ఫ్యామిలీ –వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో ముందుకు వెళ్తున్నాం. ఉద్యోగాలు చేయడం కాదు. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మన యువత ఎదగాలి. నూతన విధానాలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి. యువత భవిష్యత్తులో పెనుమార్పులు తీసుకు వస్తాయి.' అని ఆయన చెప్పారు. రానున్న ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ పాలసీలను రూపొందిచినట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం కూడా తమ లక్ష్యమని ఆయన అన్నారు.

ఐదు జోన్లలో ఇన్నోవేషన్ హబ్‌లు

అమరావతి కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి అనుబంధంగా విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ లేదాగుంటూరు, తిరుపతి, అనంతపురంలో జోనల్ ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆదాయం పంచాలన్నదే తమ నినాదమని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామని, రాయలసీమను ఇక అభివృద్ధి కేంద్రంగా మారుస్తామని, రాళ్లసీమ అనే పేరు మారుస్తామని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రానికి గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పోర్టులు టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భావనపాడు పోర్టు పరిధిలో 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఉపాధి కల్పనతోపాటు రాష్ట్రం అభివృద్ధి చెందాలని అన్నారు.

గంజాయి తాగితే అదే చివరిరోజు

"రాష్ట్రంలో ఇక నుండి ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగిస్తే అదే వారికి చివరిరోజు అవుతుంది, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులకు జీవితాంతం గుర్తుండేలా సంఘ బహిష్కరణ శిక్ష విధిస్తాం, ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. ఈ విషయాన్ని గంజాయి తాగేవారి తల్లిదండ్రులు కూడా గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగించి అరాచకశక్తులుగా మారి కొంతమంది తల్లి, చెల్లి, కన్నబిడ్డకు కూడా తేడా తెలియకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీనిని ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వీటి నివారణ కోసంహోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అని అధ్యక్షతన మంత్రులు లోకేష్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, గుమ్మడి సంధ్యారాణితో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా యాంటీ నార్కోటిక్ టాస్కుఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సీనియర్ ఐపిఎస్ అధికారి ఆకె రవికృష్ణ నాయకత్వం వహిస్తారని, ప్రత్యేక స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని, సుమారు 570 మంది సిబ్బందిని కేటాయిస్తున్నట్లు సిఎం తెలిపారు. 26 జిల్లాల్లోనూ నార్కోటిక్స్ పోలీసు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేసుల విచారణకు ఎపి హైకోర్టు ఆధ్వర్యంలో జిల్లాల్లో ఐదు ప్రత్యేక కోర్టులు, లేదా ఐదు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిమండలి నిర్ణయించింది.

ఉద్యోగాల కల్పన%ొ% ధరల నియంత్రణ

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు వీలుగా లోకేష్ ఛైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. దీనిలో మంత్రులు టి.జి.భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, పి.నారాయణ, బి.సి.జనార్ధన్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. అదే విధంగా ధరల నియంత్రణ కోసం పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మరో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించారు. దీనిలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, సవిత సభ్యులుగా ఉన్నారు.

చెత్తపన్ను రద్దు

రాష్ట్రంలో చెత్తపన్ను రద్దుకు మంత్రిమండలి ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి చెప్పారు. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.600 కోట్లను కేటాయించినట్లు సిఎం తెలిపారు. గ్రామీణ, పంచాయతీ, పట్టణ రహదారులపై ఎక్కడా గుంతలు లేకుండా ఉండే విధంగా గత క్యాబినెట్లో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రహదారుల మరమ్మతులకు చేపట్టిన పనుల ప్రగతిని తెలిపే స్టేటస్ నోట్‌కూ మంత్రిమండలి ఆమోదించినట్లు తెలిపారు. పంచాయతీ రోడ్ల ఏర్పాటుకు గత ప్రభుత్వం టెండర్లు ఇచ్చిందని వాటికి సంబంధించి ఆర్థికశాఖలో ఇంతవరకు వివరాలు లేవని తెలిపారు. వీటితోపాటు కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడలో ఎకరా రూ.16.50 లక్షలకు కేటాయించేందుకు నిర్ణయించినట్లు సిఎం చెప్పారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, విచారణ చేసేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని చంద్రబాబునాయుడు వివరించారు. ఇసుక విషయంలో మంత్రులను జోక్యం చేసుకోవద్దని హెచ్చరించామని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. దీనికోసం ఫోన్ నెంబరు కేటాయిస్తామని పేర్కొన్నారు.

# దక్షిణకోస్తాలో కుండపోత

**- చెన్నైలో నీట మునిగిన పలు కాలనీలు - లోతట్టు ప్రాంతాలు జలమయం**

**- పొంగుతున్న వాగులు, వంకలు - రాకపోకలకు అంతరాయం**



యంత్రాంగం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో దక్షిణకోస్తాతో పాటు రాయలసీమలోని పలు జిల్లాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. తమిళనాడు మీద కూడా వాయుగుండం ప్రభావం తీవ్రంగా కనిపించింది. చెన్నైలోని పలు కాలనీలు నీటమునిగాయి. మహానగరం జలమయంగా మారింది. మరోవైపు రాష్ట్రంలో తిరుపతి, చిత్తూరుబీ నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయాయి. వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. తిరుపతి–చెన్నై సెంట్రల్ (16203) తిరుపతి ఎక్స్‌ప్రెస్, తిరుపతి–చామరాజనగర్ (16220) కాట్పాడి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసింది. వాయుగుండం గురువారం తీరం దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. బుధవారం సాయంత్రానికి వాయుగుండం చెన్నైకు 190, పుదుచ్చేరికి 250, నెల్లూరుకు 270 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. నైరుతి బంగాళాఖాతంలో ఉన్న ఈ వాయుగుండం పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణం చేసి చెన్నైకి సమీపంలో పుదుచ్చేరి, నెల్లూరు మధ్య గురువారం తెల్లవారుజామున తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

తిరుమల డ్యాముల్లోకి 250 లక్షల గ్యాలన్లు

భారీ వర్షాలతో తిరుమల్లోని డ్యాముల్లోకి 250 లక్షల గ్యాలన్ల నీరు చేరింది. ముందుజాగ్రత్త చర్యలుగా పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాలను టిటిడి మూసివేసింది. తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. తిరుమల గిరుల్లో మాల్వాడిగుండం భారీగా ప్రవహిస్తోంది. రేణిగుంట విమానాశ్రయంలో రన్‌వేపైకి నీరు చేరడంతో ల్యాండింగ్ సమస్య తలెత్తి ఇండిగో విమానాన్ని చెన్నైకి మళ్లించారు.

దక్షిణకోస్తాలో..

నెల్లూరు జిల్లాలో 83 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వరికుంటపాడు, మర్రిపాడు, ఆత్మకూరు మండలాల్లోని వాగులు పొంగి రోడ్లపైకి వచ్చాయి. రాకపోకలు నిలిచాయి. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం చదలవాడలో రామన్న చెరువుకు గండి పడింది. దీంతో, 216 జాతీయ రహదారిపై ఐదు అడుగుల మేర వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. యుద్ధప్రాతిపదికన ఈ గండిని పూడ్చారు. హనుమాపురం వాగు, కొత్తకోట వాగు పొంగి ప్రవహించాయి. మాచవరం సమీపంలో దండావాళ్ల వాగు కట్టతెగి పొలాల్లోకి వరద నీరు చేరింది. కొత్తపట్నంలో సుమారు 15 మీటర్ల మేర సముద్రం ముందుకొచ్చింది. బాపట్ల జిల్లా చినగంజాలో 267 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చీరాల, భట్టిప్రోలు ప్రాంతాల్లో చేనేత మగ్గాల్లో వర్షపు నీరు చేరింది. చినగంజాం మండలం పెదగంజాం గ్రామం నుంచి పూర్తిగా రాకపోకలు నిల్చిపోయాయి.

రాయలసీమలోజి

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో 134 మిల్లీమీటర్లు, వైఎస్ఆర్ జిల్లా పోరుమామిళ్లలో 90 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వరి, ఉల్లి పంటలు నేలకొరిగాయి. వీరపునాయునిపల్లె మండలంలోని బుసిరెడ్డిపల్లెకు వెళ్లే రహదారిలోని వంక బ్రిడ్జి వరద నీటి ప్రవాహం వల్ల తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వైఎస్ఆర్ జిల్లాలో 2024.2 ఎకరాల్లో వరి పంట ఒరిగిపోయింది. 254.5 ఎకరాల్లో మినుము పంట నీట మునిగింది. కడప ఆర్‌టిసి బస్టాండ్‌లోకి వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సిరివెళ్ల, రుద్రవరం ప్రధాన రహదారిలో బ్రిడ్జిపై వర్షపు నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బనగానపల్లె మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. ఆళ్లగడ్డ మండలం సిరివెళ్ల సమీపంలో వాగు పొంగి పొర్లుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


ఉప్పాడలో అల్లకల్లోలం..

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలోని సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలల తాకిడికి రక్షణ రాళ్లు బీచ్ రోడ్డుపైకి కొట్టుకొస్తున్నాయి. ఉప్పాడ గ్రామంలోని మాయాపట్నం, సూరాడపేటల్లో పలు గృహాలు కోతకు గురవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మోస్తారు వర్షాలు కురిశాయి.

## నష్టపోయిన రైతుల పంట రుణాలు రద్దు చేయాలి

### - రైతు సంఘాల సమన్వయ సమితి

అమరావతి: వరదలు కారణంగా పంట నష్టపోయిన రైతులకు పంట రుణాలు రద్దు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎపి రైతు సంఘాల నాయకుల బృందం కోరింది. వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిని, రైతు సంఘాల నాయకుల బృందం బుధవారం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించింది. కంద, పసుపు రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని ఎకరాకు రూ.14 వేలు చెల్లించిందని, అయితే కంద రైతులకు ఎకరాకు రూ.86 వేలు, పసుపు రైతులకు ఎకరాకు రూ.46 వేలు పంట నష్టపరిహారాన్ని అదనంగా చెల్లించాలని కోరారు. పంట వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి మాత్రమే ఈ పరిహారం అందించాలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. లంక భూముల్లో పేరుకుపోయిన ఇసుక, బురద, మట్టిని ప్రభుత్వ ఖర్చుతో తొలగించాలన్నారు. కొత్తగా పంట వేసుకోవడానికి విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు అందించాలని కోరారు. వరద నీటిలో విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు మునిగిపోయాయని, వీటికి మరమ్మతులు చేయించాలని, లేనిపక్షంలో అందుకయ్యే వ్యయాన్ని అంచనా వేసి పరిహారంగా చెల్లించాలని రైతు సంఘాల నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సమితి రాష్ట్ర నాయకులు వై కేశవరావు, ఎం హరిబాబు, పి జమలయ్య, లక్ష్మణస్వామి, యు వీరబాబు, మరీదు ప్రసాద్‌బాబు, కోగంటి ప్రసాద్, కోటయ్య, వేణుగోపాలరావు, పెద్ది గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు



"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com